సాక్షి
ఖమ్మం

గురువారం । 6 । మార్చి । 2025



ఖమ్మంలోని ఓ కేంద్రం వద్ద ఇంటర్‌మీడియట్ విద్యార్థులు (ఇన్‌సెట్) పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థిని



పరీక్షకు ముందు గణపతి దేవాలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు



పరీక్ష హాల్‌లో...

తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలు
- మొదటి రోజు 669మంది విద్యార్థుల గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 72 కేంద్రాలు ఏర్పాటుచేయగా 18,701 మందిలో 18,032మంది విద్యార్థులు హాజరు కాగా, 669మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 16,317మందికి 15,845మంది, ఒకేషనల్ విభాగంలో 2,384 మందికి 2,187మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. నయాబజార్ జూనియర్ కళాశాల, ఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల, కూసుమంచి కేజీబీవీల్లో పరీక్షల నిర్వహణను ఇంటర్మీడియట్ బోర్డుకు చెందిన సీహెచ్.యాదగిరి, కె.విశ్వేశ్వరరావు పరిశీలించగా, 39కేంద్రాల్లో హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని డీఐఈఓ తెలిపారు. మొదటి రోజు సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్ పరీక్షలు జరగగా విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. వీరి వెంట తల్లిదండ్రులు, బంధువులు రావడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయగా జిల్లాతో పాటు హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

10నుంచి మూల్యాంకనం

బుధవారం మొదలైన ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 20వ తేదీతో ముగియనున్నాయి. ఈక్రమాన 10వ తేదీ నుంచి జవాబుపత్రాల మూల్యాంకనం చేయనున్నారు. మొదట సంస్కృతం సబ్జెక్ట్, ఆతర్వాత దశల వారీగా అన్ని సబ్జెక్టుల మూల్యాంకనానికి ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లుచేస్తున్నట్లు డీఐఈఓ రవిబాబు తెలిపారు.

ఇఫ్తార్
(గురువారం సా॥)
6.22

సహర్
(శుక్రవారం ఉ॥)
5.07

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పోలీసు కుటుంబాలకు ఉచిత కంటి పరీక్షలు



శిబిరంలో పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు కుటుంబాల కోసం బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వాసన్ ఐ కేర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరాన్ని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 200మందికి పరీక్షలు చేయగా, సమస్యలు ఉన్నవారికి రాయితీపై శస్త్ర చికిత్సతో పాటు కంటి అద్దాల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్‌సింగ్, వైద్యబృందం శివరామ్, రాజేష్, ఇతేందర్, అప్సర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ప్లాంట్లకు 139 దరఖాస్తులు

ఖమ్మంవ్యవసాయం: బీడు, బంజర భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకొస్తున్నారు. భూముల్లో ప్లాంట్లు ఏర్పాటుచేయడం ద్వారా ఆదాయం పొందేలా రైతులను కేంద్రప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. పీఎం కుసుమ్ పథకం కింద 500కిలోవాట్లు మొదలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశముండగా, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్‌తో డిస్కంలు కొనుగోలు చేస్తాయి. ఈ పథకం కోసం దరఖాస్తు గడువును 10వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యాన బుధవారం వరకు 139 దరఖాస్తులు అందాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 38, ఖమ్మం జిల్లా నుంచి 101దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయని రెడ్‌కో ఉమ్మడి జిల్లా మేనేజర్ పోలిశెట్టి అజయ్‌కుమార్ తెలిపారు.

కూడళ్ల ఆధునికీకరణకు అడుగులు



కూడలిలో పరిశీలిస్తున్న కమిషనర్, అటవీ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కూడళ్ల అభివృద్ధికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, హైదరాబాద్ నుంచి ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణ బుధవారం కూడళ్లను పరిశీలించి అభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించారు. ప్లాంటేషన్‌తోపాటు క్లాక్‌టవర్ ఏర్పాటు, భారీ విద్యుత్ లైట్ల ఏర్పాటుకు చర్చించారు. ఈమేరకు త్వరలోనే నగర సుందరీకరణ, కూడళ్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిసింది.

ఇకపై ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం





మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్, రాగమయి తదితరులు (ఇన్‌సెట్) గోదావరి జలాలకు పూలు సమర్పిస్తున్న మంత్రి తుమ్మల

- 'సీతారామ' ద్వారా ఎన్నెస్పీ ఆయకట్టుకు గోదావరి జలాలు
- మెయిన్ కెనాల్ నుంచి రాజీవ్ లింక్ కెనాల్‌లోకి విడుదల
- పూజలు చేసి మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నల్లబండబోడు వద్ద గోదావరి జలాలకు పూజ చేస్తున్న మహిళలు

జూలూరుపాడు: సీతారామ ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. జూలూరుపాడు మండలం వినోభానగర్ వద్ద సీతారామ కాల్వ నుంచి రాజీవ్ కెనాల్‌లోకి గోదావరి జలాలను ఆయన బుధవారం రాత్రి 9 గంటలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు పూజలు చేసి చీర, సారె సమర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో తుమ్మల మాట్లాడారు.

రూ.100 కోట్లు మంజూరు చేయించా..

గత ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో భాగంగా మూడు పంప్ హౌస్‌లను నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్‌లో ఏన్కూర్ రాజీవ్ లింక్ కెనాల్ లేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం వచ్చినప్పుడు ఒప్పించి రూ.100 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. ఈ కాల్వ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, వారిని ఒప్పించిన రెండు జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో చకచకా పూర్తయిందని తెలిపారు. కాగా, తాను ఏ పార్టీలో ఉన్నా ప్రజలు, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేశానని వివరించారు. సీతమ్మ సాగర్ నిర్మాణం పూర్తయితే 36 టీఎంసీల నీరు నిల్వ చేయవచ్చని, గోదావరి – కృష్ణా జలాల అనుసంధానంతో సాగర్ ఆయకట్టులో 1.80 లక్షల ఎకరాలను స్థిరీకరించవచ్చని వెల్లడించారు. కాగా, సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ కింద నాలుగో పంప్ హౌస్‌ను అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈమేరకు కెనాల్‌కు భూములు ఇచ్చిన రైతులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, డాక్టర్ మట్టా రాగమయి, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, రాధాకిషోర్, మాలోత్ మంగీలాల్ నాయక్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ స్వాతి బిందు, ఇరిగేషన్ అధికారులు శ్రీనివాసరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

100 కి.మీ. ప్రయాణం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం వద్ద గోదావరి నదిపై కాటన్ నిర్మించిన ఆనకట్ట నుంచి నీరు ఎత్తిపోసేలా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. ఈ పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరు, ములకలపల్లి మండలంలోని వీ.కే.రామవరం, కమలాపురంలలో పంప్‌హౌస్‌లు నిర్మించి మోటార్లు అమర్చారు. అలాగే, ఇప్పటివరకు 100 కి.మీ. మేర కాల్వల తవ్వకం పూర్తయింది. పంప్‌హౌస్‌ల్లో మోటార్లను మూడు రోజులుగా నడిపిస్తుండగా గోదావరి జలాలు బుధవారం సాయంత్రం వరకు జూలూరుపాడు మండలం నల్లబండబోడు వద్దకు చేరాయి. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన గ్రామస్తులతో కలిసి వైరా ఎమ్మెల్యే రాందాస్ గోదావరి జలాలకు పూజలు చేశారు. అక్కడి నుంచి సీతారామ మెయిన్ కెనాల్ ద్వారా వినోభానగర్ వద్దకు రాత్రికల్లా జలాలు చేరుకున్నాయి. ఆపై కొత్తగా నిర్మించిన రాజీవ్‌కెనాల్‌లోకి నీటిని మంత్రి తుమ్మల విడుదల చేశారు. అనంతరం ఏన్కూరు మండలం అక్కినాపురం తండా 52వ కి.మీ. వద్ద ఎన్నెస్పీ(నాగార్జునసాగర్ ప్రాజెక్టు) కాల్వలోకి బుధవారం అర్ధరాత్రి దాటాక చేరాయి.

లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని ఎన్నెస్పీ ఆయకట్టుకు అందించేలా ఏన్కూరు లింక్ కెనాల్ (రాజీవ్ కెనాల్) నిర్మాణం చేపట్టారు. తద్వారా జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా రిజర్వాయర్‌తో పాటు సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో 1.20 లక్షల ఎన్నెస్పీ ఆయకట్టు గోదావరి జలాలతో స్థిరీకరణ జరగనుంది.

ఎనిమిది గంటల పాటు ఎత్తిపోత

అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్ట్ ఫేస్ –1 పంప్‌హౌస్ నుంచి మూడో రోజైన బుధవారం కూడా గోదావరి జలాలను ఎత్తిపోశారు. పంప్‌హౌస్‌లోని ఒక మోటార్ ద్వారా ఎనిమిది గంటల పాటు 86.4 ఎంసీఎఫ్‌టీ నీటిని దిగువకు విడుదల చేశారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు పంప్‌హౌస్‌ల ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్‌కు, అక్కడి నుంచి ఎన్నెస్పీ కెనాల్‌కు గోదావరి జలాలు చేరుతున్నాయి.



బీజీకొత్తూరు పంప్‌హౌస్ నుంచి దిగువకు ఎత్తిపోస్తున్న నీరు

మీరు మా అతిథులు!



భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

- దివ్యాంగులకు ఏ సమస్య రానివ్వం
- కలెక్టరేట్‌లో ఉచిత భోజనాన్ని ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఉచిత భోజనం ఇలా..

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్ డేతో పాటు ఇతర రోజుల్లో వచ్చే దివ్యాంగులను తాము అతిథులుగా భావిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులకు ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన బుధవారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 40రోజుల క్రితం ప్రజావాణిలో వచ్చిన అభ్యర్థన మేరకు జిల్లా అధికారులతో చర్చించి ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. రానున్న మూడు నెలల్లో ప్రతీ దివ్యాంగుడికి యూడీఐడీ కార్డు అందేలా చూస్తామని, అప్పటివరకు సదరం సర్టిఫికెట్ నంబర్ ఆధారంగా టోకెన్లు ఇస్తామని చెప్పారు. కాగా, దివ్యాంగుల సంక్షేమానికి అన్ని చర్యలు చేపడుతూ వారికి ఏ సమస్యా రాకుండా చూస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 300మందికి...

అన్నంతో పాటు పప్పు, సాంబారు, కాకరకాయ ఫ్రై, టమాటా కూర, క్యాలీఫ్లవర్ చట్నీతో తొలిరోజు భోజనాన్ని సమకూర్చారు. ఈ మెనూ ప్రతిరోజు మారుతుందని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు 300కిపైగా దివ్యాంగులు భోజనం చేయగా, కలెక్టర్ చొరవను పలువురు అభినందించారు.

ప్రతీ తహసీల్‌లో హెల్ప్‌డెస్క్

దివ్యాంగులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా ప్రభుత్వం తరఫున పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం యూనిక్ డిజెబిలిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ) పొందే విధానంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు నిర్మిస్తుండగా, ప్రతీ తహసీల్‌లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకంలో అవకాశం కల్పిస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్వో ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో భోజనంలా ఉంది...



కలెక్టరేట్‌లో మాకు ఉచిత భోజనం సమకూర్చడం బాగుంది. ఉచితమైనా నాణ్యమైన భోజనం సమకూర్చడంతో ఇంట్లో తిన్నామనే సంతృప్తి కలిగింది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చొరవతో ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తుండడం ఆనందంగా ఉంది.

– కొత్తూరి వెంకటాచారి, నేలకొండపల్లి

మంచి ఆలోచన



దివ్యాంగుల కోసం కలెక్టర్ మంచి ఆలోచన చేశారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి భోజనం ఎంతగానో ఉపయోగపడుతుంది. కలెక్టర్ ఉన్నతమైన ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా అనిపిస్తోంది.

– వై.స్వరూప, పాతర్లపాడు

ఇబ్బందులను గుర్తించారు



కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగుల ఇబ్బందులను కలెక్టర్ గుర్తించారు. అందుకే ఉచిత భోజనాన్ని ప్రారంభించారు. మంచి నాణ్యతతో రకరకాల కూరలతో సమకూర్చడం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ముత్యాల వెంకటరమణ, తనికెళ్ల

నెలాఖరులోగా పనులు పూర్తి చేయండి

ఖమ్మం సహకారనగర్: పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల్లో అభివృద్ధి నెలాఖరులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లోని బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో పనులకు రూ.1,04,65,783 విడుదల చేశామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల్లో కమిటీలు ప్రతిపాదించిన పనులు పూర్తికాగానే బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. డీఈఓ సోమశేఖరశర్మ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఏఎంఓ కె.రవికుమార్, జీసీడీఓ తులసి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం మొదలుపెట్టాలి

బోనకల్: మండలంలోని గార్లపాడులో అదనపు కలెక్టర్ శ్రీజ బుధవారం పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి స్థలాలను పరిశీలించారు. త్వరగా పనులు మొదలుపెడితే బిల్లులు వస్తాయని అవగాహన కల్పించారు. ఆతర్వాత గ్రామంలోని నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకంపై ఆరా తీశారు. ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి, ఏపీఓ కృష్ణకుమారి పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- 35డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు



ఖమ్మంవ్యవసాయం: మహాశివరాత్రి తర్వాత జిల్లాలో ఎండ తీవ్రత పెరిగింది. నెల మొదటి వారం నుంచే ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయిలో నమోదవుతున్నాయి. గతనెల 28 వరకు జిల్లాలో గరిష్టంగా 36 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈనెల 5కల్లా 39 డిగ్రీలకు పెరిగింది. దీంతో మధ్యాహ్నం వేళ బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, మార్కెట్, ఇతర ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు ఎండ తీవ్రతతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాగా, ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లో బుధవారం అత్యధికంగా 39.2 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆతర్వాత ఖానాపురం, సత్తుపల్లి, ముదిగొండ మండలం పమ్మిలో 39.1, బాణాపురంలో 39 సెల్సియస్ డిగ్రీలుగా నమోదవగా, అతి తక్కువగా తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో 32.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని అధికారిక గణాంకాల ద్వారా వెల్లడైంది.


కేవీకేలో శాస్త్రీయ సలహా సంఘం సమావేశం



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవికుమార్

వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం శాస్త్రీయ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ఆధ్వర్యాన గత ఏడాది కాలంగా చేపట్టిన కార్యక్రమాలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, మధ్య తెలంగాణ మండలి సహాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఉమారెడ్డి, హైదరాబాద్ అటారీ జోన్ -10 ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్.రెడ్డి హైదరాబాద్ పీజీటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి, డీఏఈ ధనసరి పుల్లయ్య, జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. మండల పశు వైద్యాధికారి రాకేష్, ఏడీఏలు విజయచంద్ర, కె.వెంకటేశ్వరరావు, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త వి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించొద్దు



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

నేలకొండపల్లి: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పి.ఆశాలత హెచ్చరించారు. నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నేలకొండపల్లి, కూసుమంచి మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జిల్లాలో రూ.2 కోట్ల పన్ను డిమాండ్‌కు గాను 62 శాతం వరకు వసూలయ్యాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వివిధ సర్వేల్లో నిమగ్నమైనా గత ఏడాది కంటే ఎక్కువగా వసూలు చేశారని, ఈనెలాఖరుకు నూరు శాతం వసూలు చేయాలని సూచించారు. అలాగే, తాగునీటి ఇబ్బందులు, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని డీపీఓ తెలిపారు. కాగా, ప్రతీ పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించిన డీపీఓ.. నేలకొండపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసమావేశంలో డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓలు సీ.హెచ్.శివ, రాంచందర్‌రావు పాల్గొన్నారు.

మంటలు ఆర్పేది ఎలా?



డబుల్ యూనిట్‌కు ప్రతిపాదించిన ఖమ్మం ఫైర్ స్టేషన్


ఖమ్మంలోని అగ్నిమాపక యంత్రాలు

- అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్ల కొరత
- ఎండలతో పాటే పెరుగుతున్న అగ్నిప్రమాదాలు
- డబుల్ యూనిట్ లేదా రూరల్‌లో కొత్త కేంద్రానికి ప్రతిపాదన

ఖమ్మంక్రైం: జిల్లాలో అగ్నిమాపక శాఖను కీలకమైన ఫైర్ మెన్ల కొరత వేధిస్తోంది. గత నెలాఖరు నుంచే ఎండ తీవ్రత మొదలుకాగా ఈనెలలో మరింత పెరిగింది. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎండ గరిష్టస్థాయిలో నమోదయ్యే అవకాశమున్నందున ఇదే స్థాయిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశముంది. దీంతో సిబ్బంది కొరత కారణంగా శాఖ ఉద్యోగులు కలవరపడుతున్నారు. జిల్లాలో ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి, కూసుమంచిల్లో ఫైర్ స్టేషన్లు ఉండగా నేలకొండపల్లిలో ఔట్ పోస్ట్ కొనసాగుతోంది.

ఐదు స్టేషన్లకు ముగ్గురే ఆఫీసర్లు

అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఘటనాస్థలికి వెళ్లి మంటలు ఆర్పడంలో ఫైర్‌మెన్‌లే ముఖ్యపాత్ర పోషిస్తారు. ఏ స్థాయిలో మంటలు ఉన్నా మంటలు ఆర్పడంలో శిక్షణ తీసుకుని ఉండడంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతారు. అలాంటి ఫైర్ మెన్ల కొరత జిల్లా అగ్నిమాపక శాఖను వేధిస్తోంది. జిలాల్లో ఐదు స్టేషన్లకు ముగ్గురు ఫైర్ ఆఫీసర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో కీలకమైన ఖమ్మం స్టేషన్‌కు ఫైర్ అధికారి లేకపోవడంతో మధిర ఫైర్ అధికారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. కూసుమంచి ఫైర్ అధికారి ఇటీవల సస్పెండ్ కాగా ఆ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఇక లీడింగ్ ఫైర్‌మెన్లు 10మంది, డ్రైవర్లు 16, ఫైర్‌మెన్లు 32, హోంగార్డులు 21మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకా 16 ఫైర్‌మెన్లు, ఒక డ్రైవర్ కమ్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రమాదాల్లో అగ్రగామి

జిల్లాలో గడ్డివాములు కాలిపోయినట్లు మరెక్కడా జరగవని.. రాష్ట్రంలోనే ఈ ప్రమాదాల్లో మొదటి స్థానంలో ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. అయితే ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు త్వరగా మంటలు వ్యాపిస్తాయి. మంటలు అంటుకున్న గడ్డివాముతో పాటు సమీపంలోని వాములు, గుడిసెలు తగలబడే ప్రమాదముంది. ఈనేపథ్యాన సుశిక్షితులైన సిబ్బంది వీలైనంత త్వరగా చేరుకుని మంటలు ఆర్పితేనే నష్టతీవ్రత తగ్గడానికి ఆస్కారముంటుంది.

ఇంకో యూనిట్ లేదా స్టేషన్

జిల్లాలోని ఖమ్మం రూరల్ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఖమ్మం నుంచే వాహనంతో సిబ్బంది వెళ్లాల్సి వస్తుంది. అయితే, ఒకేసారి రెండు చోట్ల ప్రమాదాలు జరిగితే చేసేదేం ఉండడం లేదు. దీంతో ఖమ్మంలో ప్రస్తుత ఉన్న యూనిట్‌కు అదనంగా కొత్త మంజూరు చేయాలని లేదంటే రూరల్ ప్రాంతంలో మరో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. సింగిల్ యూనిట్‌గా ఉన్న ఖమ్మం ఫైర్ స్టేషన్‌కు డబుల్ యూనిట్ మంజూరైతే సిబ్బంది పెరగడంతో పాటు ఇద్దరు ఫైర్ ఆఫీసర్లు ఉంటారు. అలాగే, అదనపు ఫైర్ ఇంజన్ వస్తుంది. ఇది సాధ్యం కాని పక్షంలో ఖమ్మం రూరల్ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుచేయాలని ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

అగ్నిప్రమాదాల సమాచారం ఇవ్వాల్సిన నంబర్లు

స్టేషన్	నంబర్	ఫైర్ అధికారి
ఖమ్మం	87126 99280	87126 99281
వైరా	87126 99288	87126 99288
కూసుమంచి	87126 99286	87126 99287
మధిర	87126 99284	87126 99285
సత్తుపల్లి	87126 99282	87126 99283
నేలకొండపల్లి	87126 99290	87126 99291
డీఎఫ్ఓ	87126 99147	
కంట్రోల్ రూమ్	87126 99444, 87126 99464, 99499 91101	
టోల్ ఫ్రీ నంబర్	101	

ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి...



ఖమ్మం అగ్నిమాపక కేంద్రాన్ని డబుల్ యూనిట్‌గా అప్‌గ్రేడ చేయడం లేదా ఖమ్మం రూరల్ ప్రాంతంలో మరో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ ప్రతిపాదనలకు ఉన్నతాధికారులకు పంపించనుండగా, అనుమతి లభించగానే ఇతర ఏర్పాట్లు జరుగుతాయి. డబుల్ యూనిట్ మంజూరైతే వ్యవసాయ మార్కెట్‌లో అగ్నిమాపక కేంద్రం ప్రత్యేకంగా ఉంటుంది.

– బి.అజయ్‌కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి

పూణె వెళ్లిన కేఎంసీ కార్పొరేటర్లు, అధికారులు


స్టడీ టూర్‌కు బయలుదేరుతున్న కార్పొరేటర్లు, అధికారులు

పారిశుద్ధ్య నిర్వహణపై అధ్యయనం

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలోనే స్మార్ట్ శానిటేషన్ సిటీగా పేరున్న పూణెలో అధ్యయనం కోసం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, అధికారులు మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన బుధవారం వెళ్లారు. కేఎంసీ కార్యాలయం నుంచి ప్రత్యేక బస్సుల్లో ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరగా, అక్కడి నుంచి విమానంలో వెళ్లి సాయంత్రానికి పూణె చేరుకున్నారు. ఈసందర్భంగా పూణెలో వ్యర్థాల నిర్వహణ, బయోగ్యాస్ ఉత్పత్తి తది తర అంశాలపై అధ్యయనం చేసి అధికారులతో చర్చి స్తారు. ఖమ్మంలోనూ అక్కడి మాదిరిగా నిర్వహణకు ఈ అధ్యయనం తోడ్పడుతుందని భావిస్తున్నారు.

నేడు పొద్దుటూరు, బోనకల్ మార్గంలో ప్రత్యేక బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: బోనకల్ మండలం పొద్దుటూరులో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుండగా ప్రత్యేక బస్సును నడిపిస్తున్నట్లు ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ పి.దినేష్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నుండి కొణిజర్ల, పొద్దుటూరు మీదుగా బోనకల్ వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఖమ్మం పాత బస్టాండ్ గురువారం ఉదయం 9–30, మధ్యాహ్నం 12–30, సాయంత్రం 03–30, 6–30 గంటలకు బస్సులు బయలుదేరతాయని, బోనకల్ నుండి ఖమ్మంకు ఉదయం 8, 11, మధ్యాహ్నం 2, రాత్రి 8 గంటలకు బస్సులు ఉంటాయని తెలిపారు.

పలు రైళ్ల రద్దు.. ఇంకొన్ని మళ్లింపు

ఖమ్మం రాపర్తినగర్: కాజీపేట–విజయవాడ మార్గంలో నిర్మిస్తున్న మూడో రైల్వే లైన్ పనులు చురుగ్గా జరుగుతున్నారు. ఈనేపథ్యాన పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు ఇంకొన్నింటిని దారి మళ్లించినట్లు ఖమ్మం రైల్వే అధికారి కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ తెలిపారు.

రద్దయిన రైళ్ల ఇవే...

రైలు నంబర్	పేరు / మార్గం	రద్దయిన తేదీలు
67767	డోర్నకల్ – విజయవాడ (పుష్‌పుల్)	ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు
67768	విజయవాడ – డోర్నకల్	
67215	విజయవాడ – భద్రాచలం రోడ్	
67215	భద్రాచలం రోడ్ – విజయవాడ	
12705	గుంటూరు–సికింద్రాబాద్ (ఇంటర్‌సిటీ)	
12706	సికింద్రాబాద్ – గుంటూరు (ఇంటర్‌సిటీ)	
12713	విజయవాడ – సికింద్రాబాద్ (శాతవాహన)	
12714	సికింద్రాబాద్ – విజయవాడ (శాతవాహన)	
12701	గుంటూరు – సికింద్రాబాద్ (గోల్కొండ)	
12702	సికింద్రాబాద్ – గుంటూరు (గోల్కొండ)	
07481	తిరుపతి – సికింద్రాబాద్ (స్పెషల్)	ఈనెల 9న
07482	సికింద్రాబాద్ – తిరుపతి (స్పెషల్)	ఈనెల 10న
22645	ఇండోర్ – కొచివిల్	ఈనెల 10న
22646	కొచివిల్ – ఇండోర్	ఈనెల 8న
22647	కోర్బా – కొచివిల్	ఈనెల 12న
22648	కోచివిల్ – కోర్బా	ఈనెల 10న
12511	గోరఖ్‌పూర్ – కోచివిల్ (రప్తీసాగర్)	ఈనెల 6, 7, 9
12512	కోచివిల్ – గోరఖ్‌పూర్ (రప్తీసాగర్)	ఈనెల 9, 11, 12
04717	హిస్సార్–తిరుపతి (స్పెషల్)	ఈనెల 8న
07418	తిరుపతి–హిస్సార్ (స్పెషల్)	ఈనెల 10న

దారి మళ్లించేవి...

20805, 20806 విశాఖ – ఢిల్లీ, ఢిల్లీ – విశాఖకు రైళ్లను 11, 12వ తేదీల్లో దారి మళ్లిస్తారు. అలాగే, 20803, 20804 విశాఖ – గాంధీధమ్, గాంధీధమ్ – విశాకు వెళ్లే రైళ్లను 6, 9వ తేదీల్లో, శాలిమార్ – హైదరాబాద్, హైదరాబాద్ – శాలిమర్ ఎక్స్‌ప్రెస్(ఈస్ట్‌కోస్ట్)ను 11, 12, 13వ తేదీల్లో, భువనేశ్వర్ – ముంబై, ముంబై – భువనేశ్వర్ (కోణార్క్) ఎక్స్‌ప్రెస్‌ను 11, 12వ తేదీల్లో, సాయినగర్ – కాకినాడ రైలును 11, 12 తేదీల్లో దారి మళ్లించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కల్లూరు: మండలంలోని చెన్నూరు వద్ద మంగళవారం సాయంత్రం చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం కట్టలేరు రేవు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈమేరకు సుబ్బాల గ్రామానికి చెందిన కొమ్మినేని బాబు, చిన్నం సాయికిరణ్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మం వన్‌టౌన్/ముదిగొండ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్ హెలీకాప్టర్‌లో ముదిగొండ చేరుకోనున్న ఆయన ముదిగొండ–వల్లభి రహదారిలో ముదిగొండ నుంచి 5కి.మీ. మేర రూ.28కోట్ల వ్యయంతో నిర్మించే నాలుగు లేన్ల రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, మరికొన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాక ఖమ్మం వస్తారు. ఖమ్మంలో డిప్యూటీ సీఎం వ్యక్తిగత సహాయకుడు టి.శ్రీనివాసరావు దశదినకర్మతో పాటు ఇతర కార్యక్రమాలకు హాజరయ్యాక భట్టి హైదరాబాద్ బయలుదేరతారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వచ్చే హెలీకాప్టర్ ల్యాండింగ్ కోసం ముదిగొండ శివారు యడవల్లి రహదారిలోని ఓ ఖాళీ స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. అక్కడ హెలీప్యాడ్‌ఏర్పాటు, పోలీస్ బందోబస్తును ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ముదిగొండ సీఐ మురళి, తహసీల్దార్ సునీత ఎలిజబెత్ పరిశీలించగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

9న జిల్లాస్థాయి చెస్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్వజ్ఞ స్కూల్‌లో ఈనెల 9న జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్.నాగేంద్రకుమార్ తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్–10, 13, 15 కేటగిరీల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పేర్ల నమోదు కోసం సీహెచ్.గోపీకృష్ణ(94401 662749)ను సంప్రదించాలని సూచించారు.

'వికసిత్ భారత్' నోడల్ సెంటర్‌గా కేఎండీసీ

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రాపర్తినగర్: వికసిత్ భారత పథకం కింద యువ పార్లమెంట్ పోటీల నిర్వహణకు నోడల్ సెంటర్‌గా ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(కేఎండీసీ) ఎంపికైంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 18–25 ఏళ్ల లోపు యువతీయువకులకు పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు, కేఎండీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 'మై భారత్ పోర్టల్'లో రిజిస్ట్రేషన్ చేసుకుని, వికసిత్ భారత్‌పై ఏమనుకుంటున్నారనే అంశంపై ఒక నిమిషం వీడియోను 9వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివరాలకు 87906 01617, 96664 09997, 90004 23287 నంబర్లలో సంప్రదించాలని వారు ఓ ప్రకటనలో తెలిపారు.

పరిహారం చెల్లించాలని తీర్పు

ఖమ్మంలీగల్: థాయిలాండ్‌లో విహారయాత్రకు డబ్బు చెల్లించినా తీసుకెళ్లని ట్రావెల్స్ నిర్వాహకులు పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత బుధవారం తీర్పునిచ్చారు. ధంసాలాపురానికి చెందిన తుమ్మ అప్పిరెడ్డి, తన భార్యతో కలిసి థాయ్‌లాండ్ విహారయాత్ర వెళ్లడానికి హైదరాబాద్‌లోని అర్చన ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఆపరేటర్ బద్దం బోజిరెడ్డి ద్వారా 2023 ఏప్రిల్‌లో రూ.71వేలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. ఆతర్వాత ప్రయాణాన్ని వాయిదా వేయడమే కాక డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించలేదు. దీంతో న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్రస్వరూప్, ఎం.అప్పారావు, కొలికొండ శరత్ ద్వారా అప్పిరెడ్డి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాడు. విచారణ అనంతరం అప్పిరెడ్డి చెల్లించిన రూ.71వేలను , కేసు నమోదు చేసిన నాటి నుంచి ఏడు శాతం వడ్డీతో కలిపి చెల్లించడమే కాక ఇబ్బంది, వేదనకు రూ.10వేలు, లిటిగేషన్ ఖర్చులకు రూ.10వేలు 45 రోజుల్లోగా ట్రావెల్స్ నిర్వాహకులు చెల్లించాలని బుధవారం తీర్పు వెలువరించారు.

చికిత్స పొందుతూ మృతి

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారానికి చెందిన తోడేటి నరేష్(25) గత నెల 27వ తేదీన జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఆయన తన బంధువైన అదే గ్రామానికి చెందిన రెడ్డెబోయిన సాయితో కలిసి కారులో కోక్యాతండాకు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నరేష్‌కు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. కాగా, కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన సాయిపై నరేష్ సోదరుడు కృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	6,800
మిర్చి	14,100	11,000
మిర్చి తాలు	6,500	5,200
పత్తి	6,850	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

రైతులకు సేవలందించేందుకే 'పొలం బాట'

రఘునాథపాలెం: రైతులకు సాగులో ఇబ్బందులు ఎదురుకాకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు తమ శాఖ ఉద్యోగులు 'పొలం బాట' క్షేత్రాలను సందర్శిస్తున్నారని ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి తెలిపారు. రఘునాథపాలెం మండలం రాములు తండా, మంచుకొండల్లో బుధవారం నిర్వహించనిపొలంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో 309 కార్యక్రమాలు జరగగా, 476 వంగిన స్తంభాలు, 590 లూజ్ లైన్లను సరిచేసి, 115 ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచామని, అవసరమైన చోట 747 స్తంభాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, ఆటో స్టార్టర్లు తొలగించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఈ సూచించారు. డీఈ రామారావు, ఏడీ సంజయ్‌కుమార్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.


పొలం బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఈ, అధికారులు, రైతులు

లింక్ లైన్ ప్రారంభం

కామేపల్లి: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురుకాకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్ఈ శ్రీనివాసచారి తెలిపారు. ముచ్చర్ల సబ్‌స్టేషన్ నుంచి కామేపల్లి సబ్ స్టేషన్‌కు ఏర్పాటుచేసిన ప్రత్యేక లింక్ లైన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డీఈలు రామారావు, హీరాలాల్, వై.వీ.ఆనంద్‌కుమార్,కల్యాణ చక్రవర్తి, ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 10న ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ విడుదల చేసిన మొదటి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌కు సంబంధించి టెక్నికల్ పరీక్షలు గతేడాది జూన్‌లో నిర్వహించిన విషయం విదితమే. ఆ పరీక్షలో మెరిట్ సాధించిన కొంత మంది జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వగా మిగిలిన మరో 36 మందికి ఈనెల 10వ తేదీన కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. సంబంధిత అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం అందించామని పేర్కొంది.

క్షయరహిత సమాజ నిర్మాణమే లక్ష్యం


వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బోనకల్: జిల్లాకు క్షయరహితంగా రూపుదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు తెలిపారు. మండల కేంద్రంలోని శాంతి నిలయంలో మానసిక దివ్యాంగులకు క్షయ వ్యాధి పరీక్షలను బుధవారం ఆయన తన సొంత ఖర్చులతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లడుతూ వారానికి మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటూ పరీక్ష చేయించుకోవాలని, క్షయగా నిర్ధారణ అయితే ఉచిత చికిత్స అందుతుందని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, ఉద్యోగులు యాకూబ్, విజయ్‌కుమార్, సందీప్, శివ, విజయ, దుర్గ, శాంతినిలయానికి చెందిన ఆల్ఫీ తదితరులు పాల్గొన్నారు.

121 డిగ్రీ కళాశాలల ఫలితాలు నిలిపివేత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను మంగళవారం రాత్రి విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో 304ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ గురుకుల డిగ్రీ కళాశాలలు ఉండగా, ఇందులో 121 ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు యూనివర్సిటీ డీన్ అకడమిక్‌కు వివిధ రకాల ఫీజులు బకాయి పడ్డారు. దీంతో ఆయా కాలేజీల ఫలితాలను యూనివర్సిటీ అధికారులు నిలిపివేశారు. డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు మొదలయ్యే సమయాన్ని ఫీజు చెల్లించాల్సి ఉన్నా కళాశాలల యాజమాన్యాల బాధ్యులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిసి సమయం కోరారు. దీంతో 15 – 20 రోజుల గడువు ఇచ్చినా చెల్లించకపోగా జవాబుపత్రాల మూల్యాంకనం సమయంలో నోటీసులు పంపారు. దీంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు చెల్లించినా ఇంకా 121 కళాశాలల బాధ్యులు స్పందించలేదు. ఈమేరకు ఆయా కళాశాలల్లో విద్యార్థుల ఫలితాలను వెల్లడించలేదు. ఈమేరకు విద్యార్థులు ఆందోళనకు గురవుతుండగా, యాజమాన్యాల బాధ్యులు బుధవారం రిజిస్ట్రార్ రామచంద్రాన్ని కలిస్తే ఆయన వీసీ దృష్టికి తీసుకెళ్తానని బదులిచ్చారు. ఈ విషయమై కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ వివరణ కోరగా ఫీజులు చెల్లిస్తేనే ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

రోడ్డుప్రమాదంలో బాలుడు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎఫ్‌సీఐ బైపాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌కు చెందిన నంగనూరి సిద్ధు(17) ఇంటర్ ఫెయిల్ కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆయన ఖమ్మంలో ఉండే స్నేహితుడు సంతోష్‌ను కలిసేందుకు బుధవారం వచ్చాడు. ద్విచక్రవాహనంపై సంతోష్, మరో స్నేహితుడితో కలిసి సిద్ధు వెళ్తుండగా బైపాస్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సిద్ధు అక్కడిక్కడే మృతి చెందగా, మిగతా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలికి ఖమ్మం త్రీటౌన్ పోలీసులు చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

సెంట్రింగ్ కార్మికుడు ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామన్నపేటకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు షేక్ ఖాజామియా(38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన పనికి వెళ్లడంలేదు. మంగళవారం రాత్రి భార్యను డబ్బులు అడిగితే లేవని చెప్పడంతో ఆమె వంట గదిలో ఉన్నప్పుడు మరో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఖాజామియా భార్య ఫర్జానా ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ప్రజారోగ్య కార్యకర్త ఆత్మహత్యాయత్నం

కేఎంసీ కమిషనర్ చాంబర్ ఎదుట ఘటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరపాలక సంస్థకు చెందిన ప్రజారోగ్య కార్యకర్త బుధవారం కార్యాలయ ఆవరణలో ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. కేఎంసీలోని పలువురు సిబ్బంది విభాగాలు మారుస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య నెల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కొందరు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు రెగ్యులర్ ఉద్యోగి అయిన ప్రజారోగ్య కార్యకర్త మాధవి సైతం నూతన విభాగంలో రిపోర్టు చేయలేదు. దీంతో ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశాక, వారం క్రితం సస్పెండ్ చేశారు. ఈమేరకు మాధవి బుధవారం కమిషనర్‌ను కలిసేందుకు రాగా ఆయన అటవీశాఖ ఉన్నతాధికారులతో సమావేశంలో ఉన్నారు. దీంతో లోపలికి వెళ్లేందుకు సిబ్బంది నిరాకరించగా తన వెంట తెచ్చుకున్న నిద్రమాత్రలను మింగడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా మాధవి బంధువులు మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు కక్షపూరితంగా ఆమెను సస్పెండ్ చేయించారని, షోకాజ్ నోటీస్‌కు సమాధానం ఇచ్చినా పరిగణలోకి తీసుకోలేదని వాపోయారు. ఈ విషయమై కమిషనర్ అభిషేక్ అగస్త్యను షోకాజ్ నోటీస్‌కు స్పందించకపోవడం, కేటాయించిన విభాగంలో విధుల్లో చేరకపోవడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అలాగే, విధుల్లో చేరని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లోనూ కోత విధించామని, బదిలీ ఉద్యోగులను రిలీవ్ చేయని అధికారులపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాధవిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

రూ.60.70 లక్షలకు మిర్చి వ్యాపారి ఐపీ

ఖమ్మం లీగల్: ఖమ్మం నగరంలోని గాంధీనగర్‌కు చెందిన మిర్చి వ్యాపారి బోగా శ్రీనివాసరావు రూ.60.70 లక్షలకు బుధవారం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు చేపట్టే ఆయన పలువురి అప్పులు చేయగా, తీర్చలేని పరిస్థితి ఎదురైందని 18మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా కోర్టులో దివాలా పిటీషన్ దాఖలు చేశాడు.

రూ.24.10 లక్షలకు..

ఖమ్మం శ్రీనివాస నగర్‌కు చెందిన అయ్యప్ప హాస్టల్ యజమాని కొండపల్లి లత రూ.24.10 లక్షలకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటీషన్ దాఖలు చేశారు. వ్యాపార అభివృద్ధి చేసిన అప్పులు తీర్చలేకపోతున్నానని పేర్కొంటూ, 12 మందిని పిటీషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు.

రూ.75 లక్షలకు తండ్రీకుమార్తె...

ఖమ్మం లీగల్: ఖమ్మం పాండురంగాపురం కాలనీకి చెందిన తండ్రీకుమార్తెలు షేక్ సైదులు, షేక్ రేష్మ రూ.75 లక్షలకు దివాలా పిటిషన్ దాఖలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగిన వీరు చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందని పేర్కొంటూ నలుగురినీ ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం ఐపీ దాఖలు చేశారు.

ఆర్టీసీ రాజధాని బస్సు బోల్తా

ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

కొణిజర్ల: ఆర్టీసీ రాజధాని బస్సు బోల్తా పడిన ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి బుధవారం తెల్లవారుజామున బస్సు వెళ్తుండగా కొణిజర్ల మండలం తనికెళ్ల బ్రౌన్స్ కళాశాల వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో బస్సు పక్కకు ఒరిగి పల్టీ కొట్టడంతో పాటు రోడ్డు పక్కనే చెట్టుకు తట్టుకుని ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సమయాన బస్సులో డ్రైవర్‌తో పాటు 12 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన బీరెల్లి రాణి, పెనుబల్లి మండలం భువనపాలెంకు చెందిన దంపతులు వై.సత్యనారాయణ, సత్యవతికి గాయాలు కాగా ఖమ్మం తరలించారు. ఆర్టీసీ అధికారులు చేరుకుని క్రేన్ సాయంతో బస్సును తీయించగా, కొణిజర్ల ఎస్ఐ సూరజ్ కేసు నమోదు చేశారు. కాగా, బస్సు ప్రమాదంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరాలు ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఫోన్‌లో ఆదేశించారు.


బస్సును క్రేన్‌సాయంతో పైకి తీస్తున్న దృశ్యం

బెదిరించిన ఘటనలో ఐదుగురిపై కేసు

కొణిజర్ల: దూషించడమే కాక చంపుతానని బెదిరిస్తున్నారంటూ గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్ పార్టనర్ ముళ్ల కిషోర్ ఫిర్యాదుతో ఇండోఖతార్ ప్రాజెక్ట్ ఎండీ ఎం.గిరితో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు. 2018లో గ్రీన్‌లాండ్ డెవలపర్స్ నుంచి ఇండోఖతార్ డెవలపర్స్‌కు విల్లాల నిర్మాణానికి అగ్రిమెంట్ చేసుకోగా ఆతర్వాత రద్దవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి పోలీసుల వద్దకు కేసు చేరింది. ఈక్రమాన గతనెల 25న ఇండోఖతార్ ఎండీ గిరి, సిబ్బంది యాకూబ్‌రెడ్డి, యాకూబ్ పాషా, జేపీ, రాంబాబు తనను దూషించి, పాటు చంపుతామని బెదిరించారని కిషోర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.